# దారి చూపిన దెయ్యం

**ఆడదంటే సరదాలకు పనికొచ్చే ఆటబొమ్మ కాదు. ఆమెకీ మగాడిలాంటి మనసుంటే... ఈ పెళ్లిళ్లన్నీ పెటాకులే...**

**పెళ్లంటే**

**-సి. ఆనందారామం**

"ఎందుకింత ఆలస్యంగా వచ్చారు?" రాత్రి పన్నెండు గంటలకి వచ్చి నిద్రపోతున్న తనని తిట్టి లేపుతోంటే, విసుగ్గా అడిగింది సీతమ్మ

రెచ్చిపోయాడు రామారావు-

"ఎందుకా విసుగు? నోరు మూసుకుని లేచి అన్నంపెట్టు. సంపాదించి పోస్తుంటే, తిని కూచోలేక తెగ నీలుగు..లే!" కసిరాడు-

ఆవులింత ఆణుచుకుంటూ లేచింది-ఈ విసుగులూ, చికాకులు, కసురులూ సీతమ్మకి కొత్తకాదు-పొద్దుటి నుంచీ నడుం వాల్చటానికి కూడా వీల్లేకుండా బండ చాకిరీ-చివరికి రాత్రి నిద్రకి కూడా నోచుకోలేదు-

అన్నం తింటున్నంత సేపూ సణుగుడే!

"కూరలో ఉప్పు ఎక్కువయింది. కష్టపడి సంపాదించి తెచ్చి పోస్తోంటే, ఇంట్లో కూచుని వండటానికి కూడా ఏడుపే! చారు నీళ్ళు పడెయ్యకపోతే కాస్త పులుసు పెట్టకూడదూ! సంపాదించి తెచ్చిపెట్టే మొగవాడికి రుచిగా అన్నం వండి పెట్టడం కూడా చేతకాదు--"

చెవులప్పగించి యంత్రంలా వినటం తప్ప మరేం చెయ్యాలో అర్థం కాలేదు, సీతమ్మకి!

పక్కింటి వెంకటమ్మగారు ఆ మధ్యాహ్నమే వచ్చి కొన్ని విషయాలు చెప్పింది.

"ఇదిగో, వదినా, విన్నావా? రామారావు అన్నయ్య ఎవరినో ఉంచుకున్నాడుట!"

"ఏమిటి? ఈయన సౌభాగ్యానికి తోడు "ఉంచుకోవటం" ఒకటా?"

"ఏదోలే! గంతకి తగ్గ బొంత! మంగళ లేదూ, దాన్ని చేరదీసాడుట!"

"ఛ! పనిపిల్లనా?"

"హుష్!గట్టిగా అనకు! ఈరోజుల్లో పనివాళ్ళెవరూ యజమానురాలిని "అమ్మగారూ!" అనటం లేదు. "ఆన్టీ" అంటున్నారు.

నువ్వుదాన్ని ఎవన్నా అన్నావంటే, వాళ్ళ వాళ్ళంతా మనకొంపలు తగలబెట్టేస్తారు. అది పంజాబీ డ్రెస వేస్తుంది. హైహీల్స్ తొడుక్కుంటుంది. చేతికి వాచీ! "థేంక్స్", "సారీ!", "డియర్" లాంటి ఇంగ్లీషు ముక్కలొచ్చు- స్టైల్గా నడుస్తుంది. సొగ్గా నవ్వుతుంది. ఇంతకంటే ఏం కావాలి? మొగ్గలోనే తుంచెయ్! గట్టిగా అడుగు! కష్టపడి దాచుకున్న నాలుగు డబ్బులూ గుంజకుపోతారు-"

ఈ ఉపదేశం సీతమ్మకి నచ్చింది. ఎలా అడగాలా అని ఆలోచిస్తోంది-

అన్నం తిన్నాక రామారావుకి భార్యమీద "ప్రేమ" పొంగుకొచ్చి "పిల్లల మధ్య పడుకోకు! ఇలారా!" అన్నాడు, తన పక్కను చేత్తో తడుతూ---

"నేనెందుకు లెండి! మంగళ ఉందిగా!" అక్కసుగా అంది-

"తెలిసిపోయిందన్నమాట!" ఏమాత్రం లజ్జపడకుండా గొప్పగా నవ్వాడు-

"నిన్ను అనాదరణ చెయ్యనులే! రమ్మంటున్నాగా!" అన్నాడు దయగా!

సీతమ్మ మనసులో మంటలు రేగాయి-

"దాన్నొదిలేస్తేనే గాని నన్ను పేరుతో పిలవకండి!" అంది-

"ఏమిటే, పొగరు? నా యిష్టం! నాయిష్టం వచ్చినట్టు ఉంటాను. నోరు మూసుకుని పడి ఉంటే ఉండు-లేకపోతే పో!"

సీతమ్మకి కన్నీళ్ళాగలేదు. మెట్రిక్తో చదువాగిపోయింది. తరువాత చదువబ్బలేదు. తండ్రి కూడా మరీ గొప్పవాడు కాదు. తననూ పిల్లల్నీ ఆదుకోలేడు. ఏంచెయ్యగలదు? ఎక్కడికి పోగలదు? ఇలాంటి బతుకు ఎలా భరించటం? పోనీ ఆత్మహత్య చేసుకుందామంటే, పిల్లలేమవుతారు?

"ఆత్మహత్య" ఆలోచన రాగనే సీతమ్మ చూపు గోడ మీది ఫోటో మీద పడింది. అది సీతమ్మ సవతి అత్తగారిది. ఆవిడ ఆత్మహత్య చేసుకుందని అంటారు-కాదు! మొగుడే హత్యచేసాడని కూడా కొందరంటారు. ఆవిడ పోయాక తన అత్తగారు మావగారికి రెండో భార్యగా వచ్చింది. ఆవిడకి తన సవతి దెయ్యమయి ఆవహించటం మొదలుపెట్టింది. ఆ దెయ్యం బెంగతోనే మావగారు పోయాడంటారు.

అలా ఫోటో వైపు చూస్తుండగా సీతమ్మ తలచుట్టూ సవతి అత్తగారు-సొంత అత్తగారు-పంజాబీడ్రెస్లో పనిపిల్ల మంగళ-అహంకారపు నవ్వుతో మొగుడూ-"అమ్మా!అమ్మా!" అంటూ పిల్లలూ--గిరగిర తిరుగుతున్నట్లనిపించింది. కెవ్వున కేకవేసింది.

సీతమ్మకి కన్నీళ్ళాగలేదు. మెట్రిక్తో చదువాగిపోయింది. తరువాత చదువబ్బలేదు. తండ్రి కూడా మరీ గొప్పవాడు కాదు. తననూ పిల్లల్నీ ఆదుకోలేడు. ఏంచెయ్యగలదు? ఎక్కడికి పోగలదు? ఇలాంటి బతుకు ఎలా భరించటం? పోనీ ఆత్మహత్య చేసుకుందామంటే, పిల్లలేమవుతారు?

★ ★ ★

సీతమ్మకి దెయ్యం పట్టిందనే వార్త చుట్టుపక్కల వ్యాపించింది. జనం ఆవిడని చూడటానికి రాసాగారు. సీతమ్మ ఊగిపోతూ "నేను ఆత్మహత్య చేసుకోలేదు-నన్ను చంపేసారు. ఈ వంశాన్ని సర్వనాశనం చేస్తాను"-అని అరిచి సొమ్మసిల్లిపోయేది.


చుట్టుపక్కల పెద్దమనుష్యులు "దెయ్యం పట్టిన దానిచేత పనులేం చెయిస్తావయ్యో! ఇంటి పనులేవో నువ్వే చూసుకుని ఆవిడకి వైద్యం చేయించు-" అని సలహా ఇచ్చారు.

ఎప్పుడూ అథార్టీ చెలాయించే రామారావు చచ్చినట్టు చెమటలు కక్కుకుంటూ ఇంటిపనుల్లో పడ్డాడు- మంగళ అతనితో మాట్లాడటం మానేసింది-

"నాకు దెయ్యమంటే భయం బాబూ! మా ఇంటికి రాబోక!" అనేసింది.

భూతవైద్యులు ఒకరిద్దరు వచ్చి చూసారు కానీ, లాభం లేకపోయింది. తాయెత్తులూ, వీబూదులు కూడా పనిచెయ్యలేదు.

దెయ్యాల మీద రీసెర్చిచేసి, అవి లేవని



నిరూపించాలనుకొంటూన్న ఒక సంస్థకి సీతమ్మ విషయం తెలిసింది. వెంటనే ఆ సంస్థలో ఒక సభ్యుడు సీతమ్మని ఇంటర్వ్యూ చెయ్యాలని సీతమ్మ ఇంటికి వచ్చాడు.

''మా ఆవిడతో మాట్లాడటానికి వీల్లేదు''- అన్నాడు రామారావు.

ఆ సభ్యుడు నచ్చజెపుతూ ''మేము ఆవిడ దెయ్యాన్ని వదలగొడ్తాం. మీకు సమస్యలు లేకుండా చేస్తాం!'' అన్నాడు.

రామారావు ఒప్పుకోలేదు. ''పరాయి మొగవాడు నా భార్యతో మాట్లాడటానికి వీల్లేదు''అన్నాడు.

అతడికి విషయం అర్థమయింది.

''ఆ దెయ్యం ''హత్య'' అంటూ ఏదేదో మాట్లాడుతోందని విన్నాం! మమ్మల్ని రీసెర్చ్ చెయ్యనియ్యకపోతే, పోలీస్ రిపోర్టిస్తాం'' అని బెదిరించాడు-

రామారావు లొంగిపోయాడు. పెళ్ళాం మీద పెత్తనం చెయ్యగలడు కానీ, పోలీసులంటే భయం!

రీసెర్చ్ మొదలయింది. రామారావుకి సీతమ్మ దగ్గరే కూచోవాలని ఉంది; కానీ ఇంటిపనితో ఆఫీస్ పనితో కుదరటం లేదు- మొదటల్లో సీతమ్మ అరుపులు వినిపించేవి-తర్వాత తర్వాత మాటలు వినిపించేవి. ఇప్పుడిప్పుడు నవ్వులు కూడా వినిపిస్తున్నాయి. అవన్నీవింటూ ఏడుస్తూ వంట చేసుకుంటున్నాడు రామారావు-

అతడికి దెయ్యమంటే భయం-

తన సవతి తల్లి దెయ్యమంటే, మరీ భయం!

★

